రొట్టెలు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - చింతపల్లి : జన్మదినం అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ప్రతి ఏటా వచ్చే ముఖ్యమైన పర్వదినమని ఆసుపత్రి సూపరిండెంట్ ప్రభావతి అన్నారు. స్థానిక ఆసుపత్రిలో నర్సింగ్ సూపరిండెంట్ గా విధులు నిర్వహిస్తున్న పద్మావతి తన 59వ జన్మదినోత్సవం సందర్భంగా రోగులు, గర్భిణీలు, బాలింతలు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో కలిసి ఆసుపత్రి వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. రోగులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు రొట్టెలు, పండ్లు పంచారు. పారిశుద్ధ్య కార్మికులలో మహిళలకు చీరలు, పురుషులకు స్వీట్లు అందజేశారు. వైద్యాధికారిని ఇందిరా ప్రియాంక, హెడ్ నర్స్ వెంకటరత్నం, సీతమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ అనిల్ దంపతులు .ఆసుపత్రి సూపరిండెంట్ ప్రభావతికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు. రొట్టెలు, పండ్లు అందజేయడంపై రోగులు కృతజ్ఞతలు తెలియజేశారు.

కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా గుర్తించాలి

- యుటిఎఫ్ డిమాండ్ - కొనసాగిన గురుకుల అవుట్ సోర్సింగ్ టీచర్ల దీక్షలు

ప్రజాశక్తి-పాడేరు : ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకులాల్లో సుదీర్ఘకాలంగా పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను తక్షణమే కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా మార్పు చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐటీడీఏ ఎదుట దీక్ష చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల దీక్షలకు యుటిఎఫ్ మద్దతు ప్రకటించింది. ఈ దీక్షా శిబిరాన్ని ఆదివారం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు తోపాటు జిల్లా సహ అధ్యక్షులు చీకటి నాగేశ్వరరావు, జి.మాడుగుల మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యం.శ్రీనివాస్, ఎస్ గంగాధర్, పెదబయలు మండలం అధ్యక్షులు జి.సతీష్, కె.ఈశ్వరరావు, హేమంత్‌లు సందర్శించి ఔట్సోర్సింగ్ టీచర్ల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి వి. మహేశ్వరరావు మాట్లాడుతూ, గిరిజన సంక్షేమ గురుకులాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గత ఏళ్ళుగా సేవలందించిన ఉపాధ్యాయుల సర్వీస్‌ను విస్మరించి ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు పని చేస్తున్న పోస్టులను డిఎస్సీలో చేర్చడం అన్యాయమన్నారు.ప్రభుత్వం సమస్యను పరిష్కారం చేసే వరకు పోరాటానికి ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అండగా ఉంటుందని అన్నారు.

ఆదివాసీ గిరిజన సంఘం మద్దతు

ప్రజాశక్తి-పాడేరు:తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురుకులల్లో పని చేస్తున్న ఔట్సోర్సింగ్ టీచర్లు చేపట్టిన రిలే దీక్షలకు ఆదివాసి గిరిజన సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. 9వ రోజు కొనసాగిన రిలే దీక్షా శిబిరాన్ని ఆదివారం ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్ సందర్శించి మద్దతు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గురుకులంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలన్నారు.ఉద్యోగ భద్రత కల్పించి సమాన పనికి సమా వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఔట్సోర్సింగ్ టీచర్స్ విధానం రద్దుచేసి గురుకుల లో పనిచేస్తున్న 1594 మంది ఉపాధ్యాయులను సిఆర్టిలుగా తక్షణమే గుర్తించాలని డిమాండ్ చేశారు.

దీక్షలో కూర్చున్న నాయకులు

ఒకటి నుంచి పటిష్టంగా ప్లాస్టిక్ నిషేధం

- వారపు సంతల్లో విస్తృతంగా ప్రచారం

వారపు సంతల్లో ప్రచారం చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి -సీలేరు: డిసెంబర్ ఒకటి నుంచి వారపు సంతల్లోని దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే వ్యాపారులపై చర్యలు తప్పవని జికె వీధి మండలం జెర్రిల పంచాయతీ సర్పంచ్ వీరోజి నాగరాజు, సీలేరు వారపుసంతలో సర్పంచి దుర్జో, ఉప సర్పంచ్ కె.వల్లి ప్రసాద్ విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా జెర్రిల, సీలేరు వారపుసంతల్లో ప్లాస్టిక్ కవర్లు వినియోగం వల్ల ఏర్పడే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయా వారపుసంతల్లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఐటిడిఎ పిఒ అభిషేక్ ఆదేశాల మేరకు ప్లాస్టిక్ కవర్లు నిషేధంపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే రూ.రెండు వేలు జరిమానాతోపాటు ఆరు నెలల జైలు శిక్ష తప్పదని స్పష్టమైన హెచ్చరికలు ఉన్నాయని, వాటిని ప్రతిఒక్కరూ విధిగా పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణం కాలుష్యమే కాకుండాకేన్సర్ వంటి రోగాలకు కారణమౌతాయని హెచ్చరించారు.జర్రెల సంతలో జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతూరు. విష్ణుమూర్తి, టిడిపి బూత్ ఇన్చార్జి మత్స్యరాజు, భగవాన్, వెటర్నరీ అసిస్టెంట్ పూజారి వాసుదేవ్, సత్తిబాబు అలాగే సీలేరు సంతలో సచివాలయ డిఎ విజయ పాల్గొన్నారు.

మన్యంలో పర్యాటక ప్రాంతాలు కిటకిట

బొర్రా గుహల్లో పర్యాటకులు

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలో బొర్రా గుహలతో పాటు ఇతర పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులు పోటెత్తారు. ఆదివారం ప్రముఖ పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు విదేశీ, ఇతర ప్రాంతాలకు చెందిన వేలాది మంది తరలివచ్చారు. ఘట్ రోడ్డుంతా వాహనాల రద్దీ నెలకొంది. రోడ్డుకు ఆనుకొని ఆయా కుటుంబాలు వనభోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. డముకు సుంకరమెట్ట, యు పాయింట్, చిట్టంపాడు, తాడిగుడ, .కట్టికి. జలపాతాలను సందర్శించి స్నానాలు చేస్తూ సెల్ఫీలు దిగారు. అనంతగిరి, బీసుపురం, సుంకరమెట రోడ్డు ఆనుకుని ఉన్న కాఫీ పొడి, ఇతర వస్తువులను కొన్నుగోలు చేశారు.

దుంబ్రిగుడ:-మండలంలోని పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు పోటెత్తారు. తెల్లవార్లు నుంచి సాయంత్రం వరకు అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి రావడంతో చాపరాయి జలపాతం పర్యాటకుల తాకిడితో కిటకిటలాడింది. పర్యాటకులు జలపాతంలో సరదాగా స్నానాలు చేస్తూ ఆనందంగా గడిపారు. ఉద్యానవనంలో ఫోటోలు తీయించుకుంటూ సందడి చేశారు. అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శించడంతో చాపరాయి జలపాతం ప్రవేశ గేటు వద్ద పర్యాటకుల రద్దీ ఏర్పడింది. వాహనాల రద్దీతో కొంతమేరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. జలపాతం నుంచి జైపూర్ జంక్షన్ వరకు రోడ్డు వైపులా వనభోజనాలు చేస్తూ పర్యాటకులు సందడి చేశారు.

చాపరాయి వద్ద పర్యాటకుల తాకిడి

మడేరు జలపాతంలో పర్యాటక సందడి!

జలపాతంలో కేరింతలు కొడుతూ సందడి చేస్తున్న పర్యాటకులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి, మడేరు వాగు వద్ద పర్యాటక సందడి నెలకొంది. కార్తీకమాసం చివరి ఆదివారం కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు, పర్యాటకులు తరలి వచ్చి, జడ్డంగి మల్లికార్జునస్వామి ఆలయ సమీపంలో ఉన్న మడేరు వాగులో పుణ్యస్నానాలు చేసి, శివాలయంలో పూజలు చేశారు. ప్రమాదభరితం కాని జలపాతం కావడంతో చుట్టుపక్కల ప్రాంతాల నుండి అనేకమంది విద్యార్థులు, మహిళలు, చిన్నారులు వచ్చి కేరింతలు కొడుతూ జలకాలాడారు. వన సమారాధన సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుంచి. సాయంత్రం వరకు సందడిఆ గడిపారు. ఆహ్లాదకరంగా ఉన్న ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు.

ప్రణాళికాబద్ధంగా సివిల్స్ కోచింగ్

- గిరిజన యువతకు ప్రత్యేక రాయితీ

- కరస్పాండెంట్, సెక్రటరీ ధరణి

ప్రజాశక్తి-పాడేరు:సివిల్స్ పోటీ పరీక్షల్లో ఔత్సాహిక వంతులైన అభ్యర్థులకు ప్రణాళికా బద్ధంగా ఇంటిగ్రెటెడ్ సివిల్స్ కోచింగ్ అందిస్తున్నామని 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ కోచింగ్ సంస్థ కరెస్పాండెంట్, సెక్రటరీ ధరణీ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఇంటిగ్రేటెడ్ సివిల్స్ కోచింగ్ ప్రవేశాలపై గిరిజన యువతకు తమ సంస్థలో శిక్షణ ద్వారా అందించనున్న ప్రోత్సాహం, తోడ్పాటు పై వివరించారు. వచ్చే జనవరి 19 వ తేదీన ఆన్లైన్‌లో పరీక్ష నిర్వహిస్తామన్నారు. పస్ట్ ర్యాంకు సాధించిన అభ్యర్థికి 40 శాతం, ద్వితీయ ర్యాంకు సాధించిన అభ్యర్థికి 30 శాతం, తృతీయ ర్యాంకు సాధించిన గిరిజన అభ్యర్థులకు 20 శాతం రాయితీ ఇస్తామని చెప్పారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయాలన్నారు. 10వ తరగతి సిలబస్, కరెంట్ ఎఫైర్స్ పి పరీక్ష నిర్వహిస్తామన్నారు. సివిల్స్ కోచింగ్‌లో చేరడానికి ఆసక్తి కలిగిన జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 40 శాతం రాయితీ ఇస్తామన్నారు.

రాజమండ్రి దగ్గర తొర్రేడు లేదా హైదరాబాద్ 21వ సెంచరీ శిక్షణా సంస్థలలో అభ్యర్థుల ఆసక్తి మేరకు ప్రవేశం కల్పిస్తామని పేర్కొన్నారు. పేద గిరిజన అభ్యర్థులకు రాయితీతో కూడిన సివిల్స్ శిక్షణ అందిస్తామని స్పష్టం చేసారు.సివిల్, గ్రూప్ -1, గ్రూప్ 2, ఎస్సై, ఎస్ ఎస్ సి పోటీ పరీక్షలలో 21వ సెంచరీ శిక్షణ సంస్థ నుండి 1900 మంది అభ్యర్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని చెప్పారు. గత ఏడాది 60 మంది అభ్యర్థులు ఐ ఎ ఎస్, ఐపి ఎస్, ఐ ఎఫ ఎస్, ఐ ఆర్ ఎస్ ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. ఇంటర్మీడయెట్, డిగ్రీలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు అకడమిక్ విద్యతో పాటు సివిల్స్ శిక్షణ అందిస్తున్నామన్నారు. గిరిజన విద్యార్దులకు గతంలో శిక్షణ ఇస్తే ఇద్దరు గ్రూప్-1 ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. 24 మంది ఎస్సై ఉద్యోగాలకు ఇద్దరు డిప్యూటీ డిఇ ఓ పోటీ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 9030692229 ఫోన్ నెంబర్ లో సంప్రదించాలని కోరారు.

అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయునికి నివాళి

ప్రజాశక్తి-పెదబయలు:పల్నాడు జిల్లా మాచర్ల మండలం నాగార్జున సాగర్ గిరిజన గురుకులంలో ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయునిగా పని చేస్తున్న వరప్రసాద్ సీఆర్‌టి ఉద్యోగం రాదనే మనోవేదనకు గురై మృతి చెందినట్లు రాష్ట్ర యూనియన్ తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర యూనియన్ కమిటీ పెదబయలు సభ్యుల ఆధ్వర్యంలో పెదబయలు గురుకుల పాఠశాలలో వరప్రసాద్ చిత్ర పటానికి శ్రద్ధాంజలి ఘటించారు

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో బుక్ రీడింగ్, నీతి కథలు చదివించారు. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయ అధికారి రాజబాబు మాట్లాడుతూ.. ప్రతీ ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చే అలవాటు చేసుకోవాలని చెప్పారు.

చదువుతున్న విద్యార్థులు

అడవుల్లో అగ్ని ప్రమాద నివారణకు చర్యలు

రేంజ్ కార్యాలయ ఆకస్మిక తనిఖీలో సిసిఎఫ్ బిఎస్ఎన్ మూర్తి

సిబ్బందికి సూచనలు చేస్తున్న సిసిఎఫ్ మూర్తి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు నివారణకు కట్టుదిట్ట చర్యలు చేపట్టినట్లు రాజమహేంద్రవరం సిసిఎఫ్ బిఎన్ఎన్ మూర్తి తెలిపారు. స్థానిక ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి, తనిఖీ నిర్వహించారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అటవీ సిబ్బంది విధి నిర్వహణలో ఆలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనంతరం రాజమహేంద్రవరం సీసీఎఫ్ బిఎన్ఎన్ మూర్తి. విలేకర్లతో మాట్లాడుతూ, ప్లాంటేషన్ పెంచడంతోపాటు, ఎస్ఎంసి చెక్‌డ్యాంలు, నీటి గుంతలు, నీటి సంరక్షణ, వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా అడవిలో ఫైర్ లైన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏలూరు, రంపచోడవరం, చింతూరు డివిజన్లలో అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సిసిఎఫ్ తెలిపారు. అటవీ పరిరక్షణకు కట్టు దిట్టమైన చర్యలు చేపడుతున్నామన్నారు.వచ్చే ఏడాదికి ప్లాంటేషన్ కొరకు నర్సరీలు విస్తృతపరుస్తామని తెలిపారు .ప్రస్తుతం 8 జిల్లాలో 35 నర్సరీలు సాగు చేస్తున్నట్లు వెల్లడించారు. ఫారెస్ట్ అనుమతులతో ఐదు మైనింగ్ క్వారీలు నడుస్తుండగా, మరో మూడు అటవీశాఖ అనుమతులు లేకుండా నడుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని దీనిపై కోర్టులో పిటిషన్ వేసినట్లు వివరించారు. 516ఇ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా అటవీ భూములను కేటాయించాల్సి వస్తే, ప్రత్యామ్నయంగా అటవీ శాఖకు రెవెన్యూ అధికారులు భూమి అప్పగిస్తే ఎటువంటి అభ్యంతరాలు ఉండవన్నారు.ఆ ప్రక్రియకు ఒక నెల సమయం పడుతుందన్నారు.

350 హెక్టర్లలో అటవీ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఉపాధి హామీ, ఇజిఎస్ నిధులతో కోటి మొక్కలు పెంపకం పనులు జరుగు తున్నాయన్నారు.అటవీ పరిరక్షణ, వన్యమృగ సంరక్షణకు సుమారు 400 మంది ఫ్రంట్ లైన్ సిబ్బంది అవసరం ఉందని ప్రభుత్వం వారిని ఏర్పాటు చేసినట్లయితే కొరత తీరుతుందన్నారు. సుమారు 20 లక్షల హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉందన్నారు. రోజ్ వుడ్ ప్లాంటేషన్‌కు సన్నాహాలు చేస్తున్నట్లు సిసిఎఫ్ తెలిపారు. అనంతరం జడ్డంగి ఫారెస్ట్ సెక్షన్ పరిధిలో చెరుకుంపాలెంలో 1982లో నాటిన 10 హెక్టార్ల టేక్ ప్లాంటేషన్‌ను పరిశీలించారు .సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిసిఎఫ్ వెంట డిఎఫ్ఓ రవీంద్ర ద్వామ, సబ్ ఎఫ్ఒ జెవి.సుబ్బారెడ్డి, స్థానిక రేంజ్ అధికారి ఉషారాణి, అడ్డతీగల రేంజ్ అధికారి సయ్యద్ షహంసా,ఎఫ్ఎస్ఒలు మూర్తి, రాము ఫారెస్ట్ సిబ్బంది ఉన్నారు.

వారపుసంతలో విరబూసిన బంతిపూలు

- పెద్దఎత్తున అమ్మకానికి తెచ్చిన గిరిరైతులు
- ధర గిట్టుబాటు కాక గిరిజన రైతుల గగ్గోలు

వారపు సంతతో కూరగాయలు, బంతిపూలను అమ్మకానికి తెచ్చిన గిరిజన రైతులు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు వారపు సంతలో గిరిజనులు బంతిపూలు విక్రయాలు జోరుగా జరిపారు. దుప్పిలివాడ పంచాయతీ పరిధిలో పిల్లిగెడ్డ, కాట్రగడ్డ , జొన్న మామిడి తదితర గ్రామాల్లో బంతిపూలను గిరి రైతులు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది బంతిపూలు అధిక దిగుబడి వస్తున్నప్పటికీ గిట్టుబాటు ధర రాకపోవడంతో శ్రమ తగ్గ ఫలితం దక్కలేదని వాపోతున్నారు. వారపు సంతల్లో పది పువ్వులు ఒక కట్టగా కట్టి నాలుగు కట్టలు 20 రూపాయలకు వికరిస్తున్నారు. కార్తీక మాసంతో పాటు అయ్యప్ప భక్తులు అధికంగా మాల ధరించడంతో భక్తులు బంతి పువ్వులు విరివిగా కొనుగోలు చేశారు. రెండు నెలల క్రితం భారీ వర్షాలు, వరదలకు పంట పొలాలు పూర్తిస్థాయిలో కొట్టుకుపోవడంతో వరిపైర్లు కొట్టుకుపోయిన పొలాల్లో రైతులు ప్రత్యామ్నాయంగా వాటిలో అంతరపంటగా బంతిపూలు సాగుపై ప్రత్యేక దృష్టి సారించారు. అలా పండిన కూరగాయలను, బంతిపూలపు సీలేరు వారపుసంతతోపాటు ఒడిశా మల్కనగిరి జిల్లా చిత్రకొండ వారపుసంతకు తీసుకెళ్లి గిరిజన రైతులు విక్రయిస్తున్నారు. బంతిపూల దిగుబడి బాగున్నప్పటికీ, తగిన ధర, మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో తమ పెట్టుబడులు, శ్రమ వృథాయే తప్ప, ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, రైతు బజార్ ఏర్పాటు చేస్తే మేలు చేకూరడమే కాకుండా కష్టానికి తగ్గ ఫలితం దక్కుతుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడేనా..?

మన్యం నుంచి మైదానానికి తరలించేందుకు గుట్టుగా ఏర్పాట్లు

ప్రజాశక్తి- దేవీపట్నం: ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి కలప అక్రమ రవాణాకు భారీ ఏర్పాట్లు చేశారు. లక్షలాది రూపాయల కలప సరిహద్దులు దాటించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కలప అక్రమ రవాణాకు ఆస్కారమివ్వబోమని ఒకపైపు అటవీశాఖ పైస్థాయి అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా జోరుగా సన్నాహాలు సాగుతున్నాయనే విమర్శలున్నాయి. ఇటీవల కాలంలో మన్యంలో కలప అక్రమ రవాణా పెద్ద చర్చనీయాంశంగా మారంది.

మైదాన ప్రాంతానికి చెందిన కొందరు వ్యాపారస్తులు ఏజెన్సీకలపపై కన్నేశారు. గుట్టు చప్పుడు కాకుండా కలప అక్రమ మార్గంలో సరిహద్దులు దాటించేందుకు స్మగ్లర్లు ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన కొన్ని చెట్లు తరలింపులో ప్రమేయం ఉన్న వ్యక్తి, ఈ అక్రమ రవాణాకు సూత్రధారని స్థానికుల్లో చర్చనీయాంశంగా ఉంది. అందరికీ తెలిసే కలప అక్రమ రవాణా వ్యవహారాం సాగుతోందని, స్మగ్లర్లకు, కొందరు అధికారులకు మధ్యనున్న సత్సంబంధాలు, లోపాయికారీ వ్యవహారాలతో ఈ అక్రమాలకు అడ్డుకట్ట లేకుండా యథేచ్ఛగా సాగుతోందనే విమర్శలూ ఉన్నాయి. ఇప్పటికే కలప అక్రమ రవాణాకు సర్వంసిద్ధం చేసుకున్నారని ప్రచారం సాగుతున్న నేపథ్యంలో దీనికి అటవీశాఖ అధికారులు ఎలా అడ్డుకట్ట వేస్తారనేదానిపై చర్చ సాగుతోంది. దేవీపట్నం మండలం నుంచి మైదాన ప్రాంతానికి కలప అక్రమ రవాణాపై ఇందుకూరు అటవీ రేంజ్ అధికారి కొండలరావు దృష్టికి తీసుకువెళ్లగా, ఇప్పటివరకు ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు. కలప అక్రమ రవాణా జరిగితే కచ్చితంగా అడ్డుకోవడంతోపాటు, ఏ ప్రాంతం నుంచి కలప అక్రమంగా తరలిపోయిందో అక్కడి అటవీ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. కలప అక్రమ రవాణాపై గట్టి నిఘా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

కొడుకు హత్య కేసులో తండ్రి అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న సిఐ వరప్రసాద్

ప్రజాశక్తి -సీలేరు: కొడుకును హత్య చేసిన కేసులో నిందితుడు చిత్రోను ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు జికె.వీధి . సిఐ పి.వరప్రసాద్ వెల్లడించారు. నిందితుడు ఏనుగుబయలులోని వారి ఇంటి దగ్గరే ఉన్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ కె..రవీంద్ర సిబ్బందితో గ్రామానికి వెళ్లి నిందితుడిని చాకచక్యంగా అరెస్ట్ చేసి, సాక్షుల సమక్షంలో విచారించినట్లు తెలిపారు. స్థానిక విలేకరులకు సిఐ వరప్రసాద్ తెలిపిన వివరాలివి.

జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ ఏనుగుబయలు గ్రామానికి చెందిన చిత్రోకు నలుగురు కుమారులు. పెద్ద కుమారుడు సన్యాసిరావు. వేరే కాపురం ఉంటున్నాడు. మద్యానికి బానిసైన కొడుకు తరచూ తన భార్య, తల్లిదండ్రులు, తమ్ముళ్లతో తగాదా పెట్టుకుని కొట్టేవాడు. ఈ క్రమంలో ఈనెల 14 మధ్యాహ్నం నిందితుడు చిత్రో భార్య, హతుడి తల్లి వాళ్లింట్లో వంట చేయకపోవడంతో, సన్యాసిరావు భార్య వంట చేసి పొలంలో పనిచేస్తున్న మామ చిత్రోకు అన్నం తీసుకెళ్ళింది. విషయం తెలిసిన సన్యాసిరావు తన భార్యతో గొడవపడడంతోపాటు, తనతండ్రితో అక్రమ సంబంధం ఉందని తీవ్రంగా కొట్టాడు. దీంతో సన్యాసిరావు భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తనతండ్రి చిత్రోను ఎలాగైనా హతమార్చాలని సన్యాసిరావు నిర్ణయించుకొని, 14న రాత్రి కత్తి పట్టుకొని తండ్రిని చంపడానికి యత్నించాడు. విషయం తెలిసిన చిత్రో ఇంటినుంచి పారిపోయి ఊరు శివారును పొదల్లో దాక్కున్నాడు. అనంతరం సన్యాసిరావు కత్తి పట్టుకుని తండ్రిని హతమార్చడానికి వస్తుండగా, కుమారుడు రాకను గమనించిన తండ్రి చిత్రో, సన్యాసిరావు తల వెనుక భాగంపై గొడ్డలితో గట్టిగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. అనంతరం గ్రామ సమీపాన అటవీ ప్రాంతంలో ట్రెంచ్‌ల్లో మృతదేహాన్ని పాతిపెట్టాడు. అందిన ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు, నిందితుడు చిత్రోను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ విరమిస్తూ మోడీ ప్రకటన చేయాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు ఈ నెల 29న విశాఖ పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రకటించి ప్రజల ఆకాంక్షలను గౌరవించాలని మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) విశాఖ జిల్లా 9వ మహాసభ డిమాండ్ చేసింది. నగరంలోని పౌరగ్రంథాలయంలో హెచ్‌ఆర్‌ఎఫ్ ప్రచురణల సంపాదకులు కె.అనురాధ అధ్యక్షతన ఆదివారం 'మన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందాం' అంశంపై వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శరత్ మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను నిలిపివేస్తున్నామని ప్రకటించేలా ప్రధానిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఒత్తిడి తేవాలన్నారు. దేశ, తెలుగు ప్రజల సంపదైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడం ప్రతి పౌరుని బాధ్యత అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో పౌర సమాజం భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయిస్తే ఏడాదికి రూ.ఐదువేల కోట్ల లాభాలు వస్తాయన్నారు. బొకోరా, రూర్కెలా తదితర స్టీల్‌ప్లాంట్‌ల కంటే ఎక్కువ సామర్థ్యం కల్గిన విశాఖ స్టీల్‌లో తక్కువ మంది ఉద్యోగులు పనిచేసి అత్యుత్తమ సేవలు అందిస్తున్న విషయాన్ని గుర్తించాలన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించేందుకు ఉద్దేశపూర్వకంగా కుట్రలుచేసి, తప్పుడు ప్రచారం ప్రభుత్వం చేస్తోందన్నారు. ఇతర స్టీల్‌ప్లాంట్‌లకు సొంతగనులు కేటాయిస్తున్న ప్రభుత్వం, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎందుకు కేటాయించడంలేదని పౌరసమాజం ప్రశ్నించాలన్నారు. సొంత గనులు కేటాయించకపోయినా స్టీల్‌ప్లాంట్ లాభాల్లో నడవడంతో, క్రమంగా ప్లాంట్‌ను బలహీన పరిచేసేందుకు గనులు, బొగ్గు కేటాయింపులపై ఆంక్షలు విధించిందని ఆరోపించారు. నక్కపల్లిలో మిట్టల్ స్టీల్‌ప్లాంట్ వస్తే 20వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని ప్రభుత్వ ప్రచారంలో నిజంలేదని పేర్కొన్నారు.

విశాఖలో పర్యావరణ విధ్వంసంపై పర్యావరణ ప్రచారకర్త సోహన్ హటంగడి మాట్లాడుతూ, బొగ్గు కాలుష్యం, అమ్మోనియం నైట్రేట్‌తో నగర ప్రజల ప్రాణాలకు భద్రతలేకుండా పోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఆర్‌ఎఫ్ ప్రచురించిన పరిశ్రమలలో మరణ మృదంగం, పారిశ్రామిక భద్రత, కాలుష్యంపై నివేదిక పుస్తకాన్ని ఆవిష్కరించారు.

దళితునిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం, కిట్టుపురం గ్రామంలో దళితుడైన చల్లా అప్పలరాజుపై పాశవికంగా దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బన్న డిమాండ్ చేశారు. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ, శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం కిట్టుపురంలో దళితుడైన చల్లా అప్పలరాజు గత నెల 26వ తేదీన కారుపై మూత్ర విసర్జన చేశారని పెత్తందార్లయిన ధర్మాన శ్రీను, ధర్మాన ప్రసాదరావు ఆధ్వర్యాన అనుచరులు దాడి చేశారని తెలిపారు. దీనిపై అప్పలరాజు కేసు పెట్టాడని మరుచటి రోజు పెత్తందార్లు ఆయన ఇంటికి వెళ్లి అప్పలరాజును, బంధువులను, విపరీతంగా కొట్టారన్నారు. అప్పలరాజు భార్య దమయంతి తలపై ఇనపరాడ్డుతో కొట్టారని తెలిపారు. ఈ రెండు కేసుల్లోనూ కోటబొమ్మాళి పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా ఎస్‌ఐ తీసుకోలేదు సరి కదా, పెత్తందార్లతో రాజీ చేసుకోమని ఉచిత సలహా ఇచ్చారని తెలిపారు. లేకుంటే అప్పలరాజు మీద కేసులు బనాయించి రౌడీషీట్ ఓపెన్ చేస్తానని ఎస్‌ఐ బెదిరించారని తెలిపారు. ఆసుపత్రి నుంచి ఎమ్మెల్సీ రిపోర్ట్ వస్తే గాని ఎస్‌ఐ కేసు నమోదు చేయలేదని చెప్పారు. గత నెల 27న కేసు నమోదు చేసినప్పటికీ, ఇంతవరకూ ఎవ్వరినీ అరెస్ట్ చేయలేదని తెలిపారు. పెత్తందార్లను తప్పించడానికి కోటబొమ్మాళి పోలీసులు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పెత్తందార్ల అమానుష దాడుల నుంచి దళితులను రక్షించాలని, ఎస్‌ఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న10 గంటలకు కోటబొమ్మాళి తహశీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని విజ్ఞప్తిచేశారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.చిరంజీవి, టి.నూకరాజు, ఎం.ఈశ్వరరావు పాల్గొన్నారు.

గర్భాశయ కేన్సర్ నివారణ టీకాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మహిళల్లో తప్పనిసరి హెచ్‌పివి వ్యాక్సినేషన్‌పై ఎఐసిసి ఆర్‌సిజిఐ ఉత్తమ మార్గదర్శకాలను ఆవిష్కరించిందని ఫ వరల్డ్ 2024 ప్రతినిధి నికితా పోర్వాల్ తెలిపారు. ఆర్‌సిజిఐ ఆల్ ఇండియా కో-ఆర్డినేటింగ్ కమిటీ హెచ్‌పివి వ్యాక్సినేషన్‌కు మద్దతు ఇస్తుందన్నారు. అర్హత కలిగిన వ్యక్తులందరికీ ఇది ఉపయోగపడుతుందని, హెచ్‌పివి వ్యాధుల నివారణ, నియంత్రణ దిశగా కీలకమైన దశను సూచిస్తుందని తెలిపారు.

గిరిజన ప్రాంత అభివృద్ధికి కృషి

జిసిసి ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్

కిడారిని సత్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- అరకులోయ: జిసిసి ఛైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ కు ఆదివారం అరకులోయలో ఘనంగా సన్మానించారు. జిసిసి ఛైర్మన్‌గా నియమించిన తర్వాత మొదటిసారిగా అరకులోయకు విచ్చేసిన ఆయనకు టిడిపి శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించి స్వాగతం పలికారు. పున్నమి అతిథి గృహం లోని ఏర్పాటు చేసిన సమావేశంలో విజయనగరం ఆర్టీసీ బోర్డు ఛైర్మన్ సియ్యారి దొన్ను దొర, టిడిపి శ్రేణులు దుస్సాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, ఈ ప్రాంత గిరిజనులపై సిఎం చంద్రబాబు నాయుడుకు ఎనలేని అభిమానం ఉందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అల్లూరి జిల్లాలో రెండు ఛైర్మన్ పదవులు ఇవ్వడమే ఇందుకు నిదర్శనమన్నారు. అందరి సహకారంతో గిరిజన ప్రాంత అభివృద్ధికి కషి చేస్తానని ఆయన అన్నారు. అదే విధంగా గిరిజన ప్రాంతంలో జిసిసి సంస్థ అభివద్ధికి కషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నమ్మకాన్ని వమ్ము చేయకుండా అవిశ్రాంతంగా ఏజెన్సీ అభివద్ధికి పార్టీ అభివద్ధికి పాటుపడతానని తనకు అందరి సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు.

విజయనగరం ఏపీఎస్ ఆర్టీసీ బోర్డు ఛైర్మన్ సియారి దొన్నుదొర మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల అభివృద్ధి తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిసిసి ఛైర్మన్ శెట్టి లక్ష్మణుడు, పెదలబుడు మేజర్ పంచాయితీ సర్పంచ్ పెట్టేలి దాసుబాబు, శెట్టి బాబురావు, బొర్ర నాగరాజు, పాండురంగ స్వామి, పొద్దు, వంతల నాగేశ్వరరావు, కొట్యాడ అప్పారావు, బూర్జలక్ష్మి, రెహమాన్, పాల్గొన్నారు.

కిడారికి ఘన స్వాగతం

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: రాష్ట్ర జిసిసి ఛైర్మన్ గా పదవి బాధ్యతలు చేపట్టి అరకు ప్రాంతంలో ఆదివారం పర్యాటించిన కిడారి శ్రావణ్ కుమార్ కు కించుమండ, అరుకు ప్రధాన కేంద్రాల్లో గిరిజన మహిళలు పూల వర్షంతోపాటు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. మండల కేంద్రం డుంబ్రిగుడలో విజయనగరం ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ దొన్నుదొరతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు థింసా నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. తెదేపా మండల అధ్యక్షుడు టి సుబ్బారావు, టీఎన్టీయూసీ ఆరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి స్వామి, ఎంపీటీసీ సభ్యురాలు గీత, మాజీ మండల అధ్యక్షుడు కమ్మిడి సుబ్బారావు తెదేపా శ్రేణులు ఘన స్వాగతాన్ని పలికారు.

ఫీజులకు విద్యార్థులను ఇబ్బంది పెడితే చర్యలు

జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు : విద్యార్థులు ఫీజులు చెల్లించలేదని, వారిని ఇబ్బందులు పెడితే సంబంధిత విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజును రియంబర్స్ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు. త్వరలోనే ఫీజులు చెల్లించడం జరుగుతుందని స్పష్టం చేశారు. బకాయి ఫీజులు కూడా చెల్లించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఫీజులు చెల్లించలేదన్న నెపంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను కళాశాలలకు అనుమతించక పోవటం, హాల్ టికెట్లు జారీ చేయకపోవటం, పరీక్షలు రాయనీయకపోవడం వంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. సంబంధిత విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి విద్యార్థి పరీక్షలు రాయడానికి విద్యాసంస్థలు అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా కాకుండా విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులను పరీక్షలకు అనుమతించాల్సిందేనని స్పష్టం చేసారు. విద్యార్థులను కళాశాల నుండి ఇళ్లకు పంపించరాదని, ఫీజు కడితేనే పరీక్షలకు, ప్రాక్టికల్స్ కు అనుమతిస్తామని విద్యార్థులను ఇబ్బంది పెట్టే సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆయా కళాశాలల యాజమాన్యాలు గుర్తించి విద్యార్థుల భవిష్యత్తు పట్ల బాధ్యత కలిగి ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు.

అవయవదానానికి 102 మంది అంగీకారం

సీతామహాలక్ష్మికి ధ్రువపత్రాలు అందజేస్తున్న శ్రీనివాస్ తదితరులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : 'మరణించినా జీవించండి' అనే నినాదంతో అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గూడూరు సీతామహాలక్ష్మి అధ్వర్యాన స్థానిక సన్ స్కూల్ ఆవరణలో అవయవ దానంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. చనిపోయాక అవయవాలను, దేహదానం చేసేందుకు అంగీకరిస్తూ ఈ సదస్సులో 102 మంది ధ్రువపత్రాలు అందజేశారు. స్థానిక నీడి వెల్ఫేర్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ భీమిలి గ్రేటర్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల, సంస్థల ప్రతినిధులు కె.శ్రీనివాస్, డాక్టర్ ఎన్ఎల్.రావు, వి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నిందితులతో పోలీసులు

10 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని ఆదివారం ఉదయం కొంతిలి జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో తరలిస్తున్న 10 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని ఎస్సై ఎల్ సురేష్ పేర్కొన్నారు. పెదబయలు నుంచి గూడ గ్రామం మీదుగా హుకుంపేట వస్తున్న ఆటోలో 10 కేజీల గంజాయి తరలిస్తుండగా ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నాడు.ఇద్దరు వ్యక్తులు తమిళనాడుకు చెందిన వారని తెలిపారు. రిమాండ్కు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- అరకులోయ : మండలంలోని మాడగడ పంచాయతీ బోసుబేడలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గిరిజన యువకుడు మృతి చెందాడు. విశాఖ వైపు నుంచి అరకులోయకు వస్తున్న టూరిస్ట్ కారు రోడ్డు పక్కన నడిచి వెళుతున్న మండలంలోని మంజగూడ గ్రామానికి చెందిన సమర్థి గురు(20) ను ఢీకోవడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన విషయాన్ని తెలుసుకున్న పోలీసులు కారును పట్టుకొని సీజ్ చేశారు. మృతదేహాన్ని అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై అరకులోయ ఎస్సై గోపాలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సందడిగా జూ పార్కు

ప్రజాశక్తి - ఆరిలోవ : కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ఆదివారం ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల సందర్శకులతో సందడిగా కనిపించింది. కుటుంబ సభ్యులు, కళాశాల, పాఠశాల విద్యార్థులు అధిక సంఖ్యలో రావడంతో జూ పార్కు కిటికిట లాడింది. ఆదివారం ఉదయం నుంచి కుటుంబ సభ్యులు, విద్యార్థులు గుంపులు గుంపులుగా జూ పార్కు అంతా తిరుగుతూ ఎన్‌క్లోజర్లలో జంతువులను చూస్తూ సంతోషంగా గడిపారు.

జూ పార్కు ఆదాయం రూ.9.61 లక్షలు

ఆదివారం ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలను 13,650 మంది సందర్శకులు సందర్శించారు. వీరి నుంచి జూ పార్కుకు రూ.9.61,724 ఆదాయం లభించిందని జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు.

సందర్శకులతో సందడిగా ఉన్న జూ పార్కు

సన్యాసిరావు చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు, కళాకారులు

గొప్ప కళాకారుడు సన్యాసిరావు

సంస్మరణ సభలో పలువురు వక్తలు - 'పాట నేనౌతా'తో స్వర నీరాజనం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజలను కదిలించే పాటలు రాసి, గానం చేసిన ధన్యజీవి సన్యాసిరావు అని పలువురు వక్తలు కొనియాడారు. 'పాట నేనౌతా' శీర్షికతో ప్రజా గాయకుడు, రచయిత జి.సన్యాసిరావు సంస్మరణ సభ ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగింది. అందులో భాగంగా కళారూపాల నీరాజన కార్యక్రమాన్ని వందలాది మంది కళాకారులతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ సన్యాసిరావు స్ఫూర్తితో కళారూపాల ద్వారా ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సాంస్కృతిక ప్రదర్శనలు మరింత విస్తృతం కావాలని, వాడవాడలా జనాన్ని చైతన్యం చేయాలని అన్నారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు మాట్లాడుతూ నిత్యం కష్టజీవులు, సామాన్యులు పడుతున్న కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేలా సన్యాసిరావు రచించిన పాటలు ఉండేవన్నారు. మెరుగైన సమాజం కోసం జీవితాంతం పరితప్పించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. బిహెచ్‌పివిలో పర్మినెంట్ ఉద్యోగిగా ఉండే సన్యాసిరావు తన కుటుంబం, పిల్లల బాగోగులు గురించి కాకుండా, కోట్ల ఆస్తులను సంపాదించాలనే భావనతో కాకుండా, తరతరాలు చెప్పుకునే విధంగా, కష్టజీవుల, శ్రమజీవుల కష్టాలపై పాటలు రాస్తూ, పాడుతూ అనేకమంది కవులు, కళాకారులను సమాజానికి అందించారని తెలిపారు. ఆయన కుటుంబంలో ఎదుర్కొన్న కష్టాలనే కొన్ని పాటలుగా రాసి గానం చేశారని గుర్తు చేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్, రచయిత నల్లి ధర్మారావు మాట్లాడుతూ ఇది ఆరుద్ర శతజయంతి సంవత్సరమన్నారు. ఆయన ప్రజా కవులు, మజా కవులు అని రెండు రకాల వారు ఉంటారని చెప్పారని, ఇందులో గంగిరెడ్ల సన్యాసిరావు ప్రజాకవిగా జీవితాంతం ఉండటం హర్షించదగిన విషయమని అన్నారు. తన చూపు తగ్గుతూ వస్తున్నప్పటికీ పాటలు రాయటం, పాడటం మానుకోలేదన్నారు. ఉద్యమాలు తమకు అవసరమైన కవులను, రచయితలను సృష్టిస్తాయని చెప్పారు. అలా సృష్టించబడ్డ కవి సన్యాసిరావు అన్నారు. అందుకే ఆయన పాటలలో జీవం ఉంటుందన్నారు. చివరి శ్వాస వరకు ఆయన కష్టజీవుల, శ్రమజీవుల పక్షాన జీవించారని చెప్పారు. కవి, గాయకుడు ఒకరే అయితే అటువంటి వారిని వాగ్గేయకారుడు అంటారని, సన్యాసిరావు ఆ కోవకు చెందిన వ్యక్తి అని కొనియాడారు. సభకు ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంటి అధ్యక్షత వహించారు. సభలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.రమణ, సాహితీ స్రవంతి నాయకులు చీకటి దివాకర్, నటులు, రచయిత బివి.అప్పారావు, ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు అరుణ్‌జీ, జగన్, ఎస్ఎం.బాషా, దండు నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు చిరంజీవి, కార్యదర్శి అప్పన్న శివ, సన్యాసిరావు కుమారుడు స్టాలిన్ పాల్గొన్నారు.

కష్టాల్లో గ్రంథాలయ సంస్థ పెన్షనర్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన 1239 మంది పెన్షనర్లకు అక్టోబర్ నెల పెన్షన్ నేటి వరకూ జమ కాలేదని, దీంతో పింఛన్ మీదే ఆధారపడి బతుకుతున్న వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థల పింఛనుదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతు మల్లేశ్వరరావు ఆవేదన వెలిబుచ్చారు. ఆదివారం ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్య, గ్రంథాలయ శాఖ మంత్రి నారా లోకేష్‌లకు ఈ మెయిల్ ద్వారా సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పంపించారు. ముఖ్యంగా ఫ్యామిలీ పెన్షనర్లు పింఛన్ సక్రమంగా అందక వైద్య చికిత్స కోసం, మందుల కొనుగోలు కోసం, దైనందిన కుటుంబ అవసరాల కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

ఏర్పాట్లుపై చర్చిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : ఈ నెల 29న దేశ ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన దాదాపు ఖరారైన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో కలిసి కలెక్టరేట్ మీటింగు హాలులో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రోడ్ షో నిర్వహణ, ఎయు ఇంజినీరింగ్ కళాశాలలో సభ, ప్రజల సీటింగ్ ఏర్పాట్లు, రవాణా సదుపాయం తదితర అంశాలపై విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి.గణబాబు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, ఇతర అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చే విఐపిలు, ప్రధాన మంత్రికి స్వాగతం ఏర్పాట్లు, రోడ్ షో, ప్రజలకు తాగునీరు, ఆహారం, ఇతర కనీస వసతుల కల్పన తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులు, అధికారులు సలహాలు, సూచనలు అందజేశారు.

ప్రధాన మంత్రి పర్యటనకు సంబంధించిన అంశాలపై ముందుగా జిల్లా కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర గవర్నర్, ఉప ముఖ్యమంత్రి వస్తున్నందున వారు ఉండేందుకు బస ఏర్పాట్లపై చేపట్టబోతున్న ప్రాథమిక చర్యలను వెల్లడించారు. గవర్నర్ నోవొటెల్, ముఖ్యమంత్రి పోర్టు గెస్ట్ హౌస్‌లో ఉండేందుకు ప్రాథమికంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 29వ తేదీ సాయంత్రం ప్రధాన మంత్రి ఐఎన్ఎస్ డేగాకు చేరుకొని అక్కడ నుంచి రోడ్డు మార్గం లేదా వాయు మార్గం ద్వారా ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానానికి చేరుకుంటారని, అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారని వివరించారు. వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, పూర్తైన ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు ఉంటాయని తెలిపారు. ఎయిర్ పోర్టు నుంచి రోడ్డు మార్గం ద్వారా వచ్చినట్లయితే టైకూన్ జంక్షన్ నుంచి ఎస్‌పి బంగ్లా వరకు ప్రధాని రోడ్ షో ఉండొచ్చని పేర్కొన్నారు. దీనికి సంబంధించి ప్రాథమికంగా జిల్లా యంత్రాంగం నుంచి చర్యలు చేపడుతున్నట్లు ప్రజా ప్రతినిధులకు వివరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకారం అందించాలని కలెక్టర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ, జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్, ఆర్‌డిఒలు పి.శ్రీలేఖ, సంగీత్ మాధుర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన షెడ్యూల్ ఇలా..

ప్రాథమిక షెడ్యూల్ ప్రకారం.. ఈ నెల 29 సాయంత్రం 3.40 గంటలకు వాయు మార్గం ద్వారా ఐఎన్ఎస్ డేగాకు ప్రధాని చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా కాన్వెంట్ జంక్షన్, రైల్వే స్టేషన్, సంపత్ వినాయక్ టెంపుల్, టైకూన్, సిరిపురం జంక్షన్ మీదుగా ఎస్‌పి బంగ్లా రోడ్డు నుంచి ఎయులోని ప్రధాన వేదిక వద్దకు 4.40 గంటలకు వస్తారు. ఈ క్రమంలో టైకూన్ జంక్షన్ నుంచి ఎస్‌పి బంగ్లా వరకు 500 మీటర్ల మేర రోడ్ షో నిర్వహిస్తారు. ప్రజలకు అభివాదం చేసుకుంటూ ప్రధాని బహిరంగ సభకు చేరుకుంటారు. అక్కడ నిర్దేశించిన కార్యక్రమంలో 4.45 నుంచి 5 గంటల వరకు రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులతో కలిసి వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రసంగాల అనంతరం 5.25 నుంచి 5.43 గంటల మధ్య ప్రధాన మంత్రి ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారు. తదుపరి 5.45 గంటలకు సభా వేదిక నుంచి ఎయిర్ పోర్టుకు తిరుగుపయనమవుతారు

ఐఆర్ఐఎ రాష్ట్ర అధ్యక్షునిగా సురేష్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం డాల్ఫిన్ డయాగ్నస్టిక్ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వి.సురేష్ ఇండియన్ రేడియాలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన జనరల్ బాడీ మీటింగ్ సందర్భంగా ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. ఇండియన్ రేడియాలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ (ఐఆర్ఐఎ) భారతదేశంలోని 25 వేల మంది రేడియాలజిస్ట్‌లతో కూడిన జాతీయ స్థాయి సంఘం. ఇది రేడియాలజీ, ఇమేజింగ్ సైన్సుల రంగంలో జ్ఞానం, విద్య, సాంకేతికతను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తుంది. బాధ్యతల స్వీకరణ అనంతరం డాక్టర్ వి.సురేష్ మాట్లాడుతూ సంఘం కోసం తన అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు డాక్టర్ కిషోర్ కుమార్ అధ్యక్షత వహించగా జాతీయ అధ్యక్షులు డాక్టర్ విఎన్.వరప్రసాద్, ఉపాధ్యక్షులు డాక్టర్ మోహన్ ప్రసాద్ హాజరయ్యారు. రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలల రేడియాలజీ విభాగాల అధిపతులు సహా అనేక మంది రేడియాలజిస్టులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డాక్టర్ కిషోర్ కుమార్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ సురేష్

ఎక్స్‌పోలోని స్టాల్స్ వద్ద ఔత్సాహికులు

ముగిసిన సోలార్ ఎక్స్‌పో

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రీ నెక్స్ట్ పేరుతో నిర్వహించిన సోలార్ రెన్యూవబుల్ ఎనర్జీ ఎక్స్‌పో - 2024 విజయవంతంగా ముగిసినట్లు ఆంధ్రప్రదేశ్ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షులు హేమ కుమార్, జనరల్ సెక్రటరీ రామ మోహన్‌రావు, ఉపాధ్యక్షులు నాగరాజు, కోశాధికారి జయబాబు, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. ఆంధ్రా యూనివర్శిటీ గ్రౌండ్‌లో మూడు రోజుల పాటు నలభై స్టాల్స్‌తో నిర్వహించిన ఎక్స్‌పోకు విశాఖ ప్రజల నుంచి విశేష ఆదరణ లభించినట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్య ఘర్ పథకంపై విశాఖ ప్రజలు విశేష ఆసక్తి చూపించారని నిర్వాహకులు తెలిపారు. తమకు అన్నివిధాలా సహకరించిన ఆంధ్రప్రదేశ్ ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్, నెడ్‌కాప్ అధికారులకు, ఎక్స్‌పోలో స్టాల్స్ ఏర్పాటు చేసిన ప్రముఖ సోలార్ ప్యానెల్ తయారీదారులు, సరఫరాదారులకు, స్టేట్ బ్యాంకు అధికారులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. విశాఖలో ఎక్స్‌పో విజయవంతమైన ఉత్సాహంతో రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని ఎక్స్‌పోలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు.

వెంకటస్వామికి తన్నీరు కోటయ్య స్మారక పురస్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు ఆచార్యులు డాక్టర్ బూసి వెంకటస్వామి తన్నీరు కోటయ్య స్మారక జాతీయ సాహితీ ప్రతిభా పురస్కారాన్ని ఒంగోలు కళామిత్రమండలి (తెలుగు లోగిలి) 18వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఒంగోలులోని ఎన్‌టిఆర్ కళా క్షేత్రంలో జరిగిన జాతీయ స్థాయి సాహితీ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ సభలో అందుకున్నారు. ప్రముఖ సాహితీ సంస్థ మహతి వ్యవస్థాపక అధ్యక్షులు మహతి తన్నీరు బాలాజీచే వారి తండ్రి పేరు మీద నెలకొల్పబడిన ఈ పురస్కారాన్ని ప్రముఖ కవి, సాహితీవేత్త కె.శివారెడ్డి, కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, కార్యదర్శి డాక్టర్ జివి.పూర్ణచందు, ప్రముఖ సంగీత విద్వాంసులు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, నాగభైరవ సాహితీ పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, కళా మిత్ర మండలి (తెలుగు లోగిలి) జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, కార్యదర్శి సింహాద్రి జ్యోతిర్మయి, అవార్డు కమిటీ ఛైర్మన్ డాక్టర్ తేళ్ల అరుణ చేతుల మీదుగా వెంకటస్వామి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, తెలుగు విభాగ ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్తర విద్యార్థులు, తెలుగు సాహితీ, భాషాభిమానులు అభినందనలు తెలియజేశారు.

వైఎస్ఆర్‌ను అవమానపరిచిన వైసిపి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆదివారం బీచ్ రోడ్‌లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ప్రియాంక దండి పాలాభిషేకం చేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవ చేసి, వారి గుండెల్లో దేవునిగా నిలిచిపోయారని తెలిపారు. అటువంటి మహనీయుని బొమ్మ పెట్టుకున్న వైసిపి ఆయన్ని అవమానపరిచేలా వ్యవహరిస్తోందన్నారు. వైఎస్ఆర్ అభిమానులు ఇక ఆ పార్టీలో కొనసాగకూడదని, తిరిగి కాంగ్రెస్‌లోకి రావాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం కోరుబిల్లి సాయి నాయకత్వంలో పలువురు ప్రియాంక దండి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు గుర్రం కనకారావు, అసిరి నాయుడు, జగన్ మురారి, మహిళా నాయకులు కాండవ గాయత్రి, యూత్ కాంగ్రెస్ నాయకులు సాయి, చైతన్య, ప్రవీణ్, కౌశిక్, రితీష్, మౌళి, వెంకట్ పాల్గొన్నారు.